కథానిక:

కన్నకడుపు

* శ్రీమతి వి. సీతారామమ్మ *

అది ఒక గాఢాంధకారమైనరాత్రి. ఆకాశము చిల్లులు పడ్డదేమోన్నట్లు భోరున వర్షం. మధ్య మధ్యలో చెవులు చిల్లులు పడేట్లు ఉరుములు మెరుపుల శబ్దాలు, వీధుల వెంబడి నీరు కాలువలుగట్టి పారుతున్నాయి. రోడ్డు ప్రక్కనే ఒకచెట్టు క్రింద నాలుగు తాటాకులతో నిర్మించుకొన్న ఒక పంచలో ప్రసవ వేదన పడుతూంది ఒక బీద ఇల్లాలు. ప్రక్కనే అంధుడైన భర్త జబ్బుతో మూల్గుతూ ఒకమూల వొదిగి వున్నాడు. నాల్గువైపుల నుండి నీరు కారుతోంది. ఇటు ఆకలికీ అటు చలికీ గజగజ వణకి పోతున్నారు. పాపం ఆ ఇల్లాలు అచ్చటే ప్రసవించింది. బిడ్డ కెవ్వుమని అరుస్తూంది. .... తండ్రి చేతులతో తడుముతూ బిడ్డను తిలకిస్తున్నాడు. తల్లికి పుత్రోదయమైనందుకు సంతోషం, తనస్థితిని తలంచుకొని మరోవైపు దుఃఖం పెళ్ళగించుకొని వస్తూంది. ఏం జేస్తుంది! వాళ్ళజానెడు పొట్టకు పిడికెడు అన్నందొరకని ఈ కాలంలో ఈ చంటిపాప నెలా సాకను? .... అందులో ఆ ప్రళయంలో ఆ చెట్టుక్రింద పంచలోనా! ఆలోచించింది .... పొత్తిగుడ్డల్లో బిడ్డను చుట్టుకొంది. వానకు తడవనీకుండా ఒక తాటాకు పైన పట్టుకొని పోతూంది. ఎక్కడికో! భర్త అరుస్తున్నాడు ఎక్కడికి పోయేదని? .... ఆమాటలనే వినిపించుకోకుండా బయలుదేరి వెళ్తూంది. ఒక పెద్దభవనం ఎదురైంది. అచ్చట ఆగింది .... పాపను హృదయానికి హత్తుకొని భోరున విలపిస్తూంది మాతృహృదయం. ఆ పసికందును తీసుకువెళ్ళి ఆ భవనం వాకిట, తలుపు దగ్గరగా పరుండబెట్టి ఏమిజరుగుతుందో అని దూరంగావచ్చి ఆవానలోనే తడుస్తూ ప్రహరీ గోడవద్ద పొంచి చూస్తూ నిలుచుని వుంది. వర్షం అంతకంతకూ ఎక్కువౌతుందే కాని తగ్గేసూచనలు కనుపించడం లేదు. వర్షపు తుప్పరలు తనపై పడేకొద్దీ ఆ పసికందు గొంతు చిల్లులు పడేట్లు కెవ్వునకేకలు పెడుతున్నాడు. తల్లి అలాగే తనబిడ్డకి ఏమి విపత్తు వాటిల్లుతుందో అని చూస్తూ నిలుచుని వుంది.

అదొక పెద్ద ధనికుని బంగళా. వారికెంతో ఆస్థి వుంది. దాన్ని అనుభవించేందుకు, ముద్దు ముచ్చటలు తీర్చేందుకు ఒక్క కొడుకైనా లేడు. ఎన్నెన్నో పూజలుచేశారు. వారి కోర్కె ఫలించలేదు. ఆ రాత్రి భార్యా భర్తలు ఇంకా నిద్రించలేదు. ఎక్కడనుండో చంటిబిడ్డ ఏడుపుధ్వని వినవచ్చింది. ఆమేడ అంతా వెదికారు. ఏమీ గోచరించలేదు. వెదకి వెదకి చివరకు వాకిటితలుపు తెరవగనే పాపం పొత్తిగుడ్డ పేలికల్లో ఒక మొగశిశువు వాకిట పండబెట్టి వుంది చుట్టుప్రక్కల చూచారు. ఎవ్వరూ కనుపించలేదు. సంతోషంతో దైవప్రసాదమని బిడ్డనెత్తుకొని లోనికెళ్ళారు. ఇదంతా చూస్తున్న మాతృహృదయం రెండు ఆనంద భాష్పాలు రాలుస్తూ తన కుటీరానికి తిరిగి వెళ్ళిపోయింది. ఇంకేముంది పంచ నేలకూలిపోయివుంది. పెద్ద చెట్టు కొమ్మ విరిగి పడివుంది.

అయ్యో! నా భర్త ఏమైనాడు. "ఏమండీ! ఏమండీ?" అంటూ వెతుక్కుంది. ప్రక్కగనే కొమ్మక్రింద పడివున్నాడు. "ఏమండీ! ఏమండీ" అంటూ పైనబడి నిమిరింది. ఇంకేముంది. శరీరం చల్లగా కొయ్యబారి పోయి వుంది. కెవ్వున కేకవేసి భర్తపై కూలిపోయింది.

* * *

పిల్లాడు ఎంతో గారాబంగా పెరుగుతున్నాడు. ధనికుని మేడలో .... ప్రతిదినం ఒక బిచ్చగత్తె వచ్చి నిలుస్తుంది మేడక్రింద బిక్షానికి. పైనుండి చిన్న పిల్లవాని చేతుల్తో వేయిస్తుంటారు బిక్షం. పాపం ఆ బిచ్చగత్తె పిల్లవాడ్ని చూస్తూ, ఆనందంతో మురిసిపోతూ కారుతున్న కన్నీటిని తుడుచుకొంటూ వెళ్తూంటుంది. ఎక్కడెక్కడో బిక్షాటన చేస్తూ ఆమేడ చుట్టుప్రక్కలే సంచరిస్తూ వుంటుంది ఆ బిచ్చగత్తె. ఈలా కొన్నిఏండ్లు గడచాయి. పిల్లవాడు పెరిగి పెద్దవాడయ్యాడు. అంతా ధనికుల పిల్లలతోటి సావాసం. కార్లో పిల్లాడు స్కూల్‌కి వెళ్తూంటే, బిచ్చగత్తె గేటువద్ద కాచుకొనివుండి "బాబూ" అనేది. బిచ్చగత్తెను చూచి ఒక అణా విసరివేసేవాడు. పాపం ఆ బిచ్చగత్తె పిల్లాడిని చూచి మురిసిపోతూ అణాను ముద్దెట్టుకొనేది. ఇది మామూలైంది. ఇలా హైస్కూల్ చదువు పూర్తికావచ్చింది. పిల్లాడు రమేష్ కాలేజిలోకి వచ్చాడు. ధనికుల పిల్లలతోటి సావాసం .... ఖర్చులు ఎక్కువయ్యాయి.

గోపి అనే స్నేహితుడొకడు దొరికాడు రమేష్‌కి. వాని స్నేహిత ప్రభావం వేశ్యల యిండ్లవరకు తీసుకు వెళ్ళింది. అంతేకాదు "సీత" అనే వేశ్యవల్లో పడ్డాడు. ఇక తనంతటదే అలవాటైంది త్రాగుడు. రమేష్ పూర్తిగా చెడిపోయాడు. రాత్రుళ్లు ఒక్కొక్కప్పుడు పన్నెండు గంటలవరకు యింటికి వచ్చేదిలేదు. బిచ్చగత్తె ప్రతిదినం రమేష్ యింటికి వచ్చేంతవరకూ ఎంతరాత్రైనా సరే గేటు వద్దనే కాచుకొనివుండి రమేష్ లోనికి వెళ్ళగనే తనూ తన గుడిశెలోనికి వెళ్తూండేది. రమేష్ ఈలాచెడిపోవడం చూచి ఆమె హృదయం ఎంతో తల్లడిల్లింది. కాని ఏమని మందలిస్తుంది. తనొక బిచ్చగత్తె. ఈలాగే తన హృదయం పరిపరి విధాల కుళ్ళుతూండేది. కొద్దికాలానికి రమేష్‌ను పెంచి పెద్దచేసిన వారిరువురూ చనిపోయారు. ఆస్థికంతా రమేష్ పెద్దఅయ్యాడు. ఇక తనచుట్టూ స్నేహితుల మయం. త్రాగుడు, జూదంతో, ఆస్థినంతా కరిగిస్తున్నారు. ఇటు వేశ్య సీత, గోపి యిద్దరూకలసి రమేష్ ఆస్థినంతా కొల్లగొట్టేశారు. చివరకు అప్పుల్లోగూడ దింపారు. సీత మీద మోజుతో అప్పులుగూడా చేశాడు. బిచ్చగత్తెకు ఈ విషయాలన్నీ తెలిసేకొద్దీ హృదయం పరిపరివిధాల తపించిపోతూంది తనబిడ్డ చర్యలకి. సుఖంగా బ్రతకాలని వాళ్ళ యింటిలో వదిలిందే గాని, ఈలా చెడిపోయ్యేందుకా? .... ఎంతగానో దుఃఖించింది. అప్పులవాళ్లు ఇంటినికాస్తా ఆక్రమించు కున్నారు. రమేష్‌ని బైటకు గెంటేశారు. ఎక్కడున్నారు, తన స్నేహితులంతా ! ఒక్కరూ ఇప్పుడు పలుకరించడమైనాలేదు. ఇక మిగిలిందల్లా వేశ్యేనని సీత యింటికి బయలుదేరాడు రమేష్. అచ్చట గోపి కౌగిళ్లో సరస సల్లాపాలాడుత్తోంది తనది అనుకొన్న సీత .... ఆ దృశ్యాన్ని చూచేసరికి రమేష్‌కి కండ్లు చీకట్లుక్రమ్మాయి. సీత యింత వ్యభిచారి అని అనుకోలేదు. మందలించబోయాడు. కాని తననే మందలించి బాగాకొట్టి రోడ్డుపైకి గెంటేశారు. బిచ్చగత్తె బిడ్డను వెతుక్కొంటూ ఏమి విపత్తు వాటిల్లుతుందోనని నిద్రకూడా లేకుండా.తిరుగుతోంది. వేశ్య యింటివైపు రాగానే రోడ్డుపై పడివున్నాడు రమేష్ స్పృహతప్పి .... అమాంతంగాపోయి బిడ్డను కౌగలించుకొని తొడపై పండబెట్టుకొని ఎన్నెన్నో శైత్యోపచారాలు చేస్తూవుంది.

"అమ్మా ...... అ....మ్మా" అంటూ రమేష్ మూల్గుతూంటే. "ఏం . నా ...న్నా" అంటూ ఆ మాతృహృదయం పొంగిపొరలి వచ్చే దుఃఖాన్ని ఆపుకొంటూ బిడ్డను నిమురుతూంది. వేడికన్నీటి బొట్లు రమేష్‌పై పడ్డాయి. కండ్లు తెరచిచూచాడు.

"ఆ ! .... ఎవరు? .... నీవా ! .... బిచ్చగత్తెవు?" అన్నాడు ఆశ్చర్యంగా !

"అవున్నాయనా ! .... నేనే .... బిచ్చగత్తెను రా నాయనా .... మాయింట్లో వుండువుగాని రా !"

"వొద్దమ్మా .... అమ్మాపైనా అన్నావ్, నీవైనా మేలు. ఇంతగా నా ఆస్థినంతా తిన్న స్నేహితుల్లో ఒక్కడైనా ఈమాట అనలేకపోయాడు. ఏంచేయను? తల్లిదండ్రులు పోయారు ఇక ఈలోకంలో నాకేంపనుంది .... ఇల్లులేదు వాకిలీలేదు .... నాకింక దిక్కెవరున్నారు .... ఎక్కడైనా దూకిచావనైనా చస్తే హాయిగా వుంటుంది .... నన్ను పోనీమ్మా" అని రమేష్ అంటుంటే తల్లికండ్లనుండి నీళ్లు కారిపోతున్నాయి.

"ఏంటమ్మా ! నా కష్టాలకు నువ్వెందు కీలా దుఃఖించడం?" అన్నాడు రమేష్.

"లేదు నాయనా కష్టాలంటే ఏమిటో కష్టపడేవారికే తెలుస్తుంది. నాతో రా నాయనా. నన్నే మీ అమ్మ అనుకో. నా బిడ్డమాదిరి చూచుకొంటాను, నీ కేకష్టం లేదు రా నాయనా" అంది.

"సరేనమ్మా నీ యిష్టం. ఆపదలో తల్లిమాదిరి కాపాడావమ్మా" అంటూ ఆమె వెంబడి నడచి వెళ్ళాడు. ఒక గుడిసెలోకి తీసుకు వెళ్ళింది. చింపిరి వస్త్రాలు, కుండ బొచ్చెలు చూస్తూ అయోమయంగా కూర్చున్నాడు రమేష్. ఎక్కడెక్కడో కష్టపడి అంట్లు తోమి, బియ్యం దంచి మున్నగు పనులు చేసి ఇన్ని నూకలు తెచ్చి వేళకు రమేష్‌కి వండి పెడ్తూంది. తనను యింట్లో పండబెట్టి ఆమె యీ వయస్సులో అలా కష్టపడడం చూసి సహించలేకపోయాడు. ఒకే ఆలోచనతో మనస్సు కలతజెందిపోయింది. ఏమైనాసరే సీతా గోపీ విషయాన్ని తేల్చాల్సిందని బయలుదేరాడు ఒకరాత్రి. నిద్రలో ప్రక్కన తడిమి చూడగా రమేష్ కనిపించలేదు. కంగారుగా లేచి వెతికింది. చీకట్లో పోతున్నాడు. ఆ నీడ వెంబడి తనూ వెంబడించింది. సందులు, గొందులు తిరిగి ఒక యింటి ముందు ఆగాడు. చుట్టుప్రక్కల చూచాడు. ఎవ్వరూ కను

పించలేదు. తలుపు నెట్టుకుని లోనికి వెళ్ళాడు. లోన గోపి కౌగిట్లో వాలి వుంది సీత. పోయిన పోవడం గోపి చెంప ఫెళ్ళున వాగిపోయింది. ఇద్దరూ కలియబడ్డారు మొలనుండి కత్తి తీశాడు రమేష్. అడ్డుగా వచ్చిన సీతను పొడిచాడు. సీత నేల కూలింది. రక్తం కారి పోతూంది. రమేష్‌కి కండ్లు చీకట్లు కమ్మాయి. మిద్దెపై నుండి దూకి ఎటో వెళ్ళిపోయాడు. గోపి పోలీసుకు ఫోన్ చేసి అచ్చటవుంటే తనకూ అపాయం వస్తుందని తలుపు తెరుచుకొని పారిపోయాడు. బైట పొంచి వున్న బిచ్చగత్తెకు ఏమీ అర్థంకాలేదు పైన జరుగుతున్న చప్పుడు విని భయపడింది. రమేష్‌కి ఏమైనా ప్రమాదం వాటిల్లిందేమో అని తలుపు నెట్టుకొని లోనికి వెళ్ళింది. గుండె నీరైపోయింది లోని దృశ్యాన్ని చూచి. సీత శవం అచ్చట పడివుంది. ఇదంతా కొడుకు పనేనని అర్థమైంది. పోయి ఆ కత్తిని పూడతీయ బోతూవుంది. ఇంతలోగా పోలీసులు వచ్చి పట్టుకున్నారు.

మరుసటి దినం కోర్టులో విచారణ. బిచ్చగత్తె బోనులో నిలుచుని వుంది.

"నీవేనా సీతను పొడిచి చంపింది" అని జడ్జి ప్రశ్నించాడు.

"ఆ నేనే, నేనే చంపాను" అని ఆమె సమాధానం.

"ఎందుకు చంపాల్సి వచ్చింది?"

"కాదు.... ఆమె కాదు ... నేను చంపింది. నేను.... ఆమె నిర్దోషి.... ఆమెను వదలండి.... ఆమె నిర్దోషి" అని అరుస్తూ, పరుగెత్తుతూ లోనికి వచ్చాడు పిచ్చివాడిలా రమేష్. అందరూ నిశ్చేష్టులైపోయారు.

"కాదు బాబూ.... నామీద అభిమానంతో చెప్తున్నాడు. ఆయనకాదు ... నేనే చంపింది నేనే" అని బోనులోంచి అరచి చెపుతూంది బిచ్చగత్తె.

రమేష్‌కి కండ్లవెంబడి నీరు కారుతున్నాయి. బిచ్చగత్తె తన కొరకు చూపిన త్యాగానికి.

"నీ వెవరు? ఎందుకలా చేశావ్" అని మరల జడ్జి ప్రశ్నించాడు.

"చనిపోయే ముందైనా నాకథ అందరికీ చెప్తాను" అని తను బిడ్డను కనడం. అచ్చట వదలడం, నాశనం చేసిన వేశ్యను తానే చంపి తన కసి తీర్చుకున్నానని చెప్పింది.

"హత్యానేరం తనే చేసినట్లు ఒప్పుకొంది గనుక వురి శిక్ష విధించా"లని తీర్పు చెప్పారు. కోర్టువారంతా లేచి వెళ్తున్నారు. రమేష్ "అమ్మా.... అమ్మా...." అంటూ వెళ్ళి అమ్మను కౌగలించుకొన్నాడు. కొడుకును ఆపలేని దుఃఖంతో కౌగలించుకొని తల నిమురుతూంది తల్లి ...

"నేను చేసిన నేరానికి నీకు వురిశిక్షా... అమ్మా" తల్లి కౌగిట్లో వాలిపోయాడు రమేష్. పోలీసులు తల్లీ బిడ్డల్ని వేరుచేసి తల్లిని తీసుకు వెళుతుంటే "అమ్మా ... అమ్మా...." అంటూ పిచ్చివాడిలా అడ్డొచ్చి గుడ్డలు చింపుకొంటున్నాడు రమేష్. తల్లి మౌనంగా పోలీసులతో వెళ్తూంది వురి కంబం వద్దకు.